**కష్టాలలో పుట్టి కష్టాలలో పెరిగి కష్టాలలోనే కడతేరిపోయే అదృష్ట విహీనులలో బలంగా ఉండే కోరిక ఒక్కటే. తమకు అత్యంత ప్రియతములయినవారు, ముఖ్యంగా తమపైన ఆధారపడినవారు మాత్రం అందుకు భిన్నమైన జీవితం జీవించాలనేదే ఆ కోరిక. సఫలమయ్యేటట్లు చూడడానికి వారు ఎంతటి త్యాగమైనా చేయగలరు కూడా.**

**పోస్ట్** అన్న కేక విని వీధి గుమ్మంలోకి వచ్చిన మురళీకృష్ణ పోస్ట్‌మన్ ఇచ్చిన ఉత్తరం అందుకుని గదిలోకి వచ్చి కుర్చీలో కూలబడ్డాడు. చేతులతోపాటు వణుకుతున్న ఉత్తరం మీది చిరునామా మళ్ళా చూచాడు. అవును. అది రాంబాబు దస్తూరీయే. సందేహం లేదు. అంతకు రెండు రోజుల క్రిందటే డిఫెన్సు హెడ్‌క్వార్టర్సు నుండి అతనికి టెలిగ్రాము వచ్చింది, ఏక్షనులో రాంబాబు చనిపోయినట్లు. ఈ రోజు రాంబాబు స్వహస్తాలతో వ్రాసిన ఉత్తరం వచ్చింది. ఉత్తరం తెరిచే ధైర్యం లేక దానిని టేబిలు మీద ఉంచి కుర్చీలో వెనక్కి వాలి కళ్ళు మూసుకున్న మురళీకృష్ణకు గత స్మృతులుతెరమీద బొమ్మల్లా కళ్ళముందుకు రావడం మొదలుపెట్టాయి.

పదిహేను సంవత్సరాల క్రిందట. అప్పుడు తనకు పదేళ్ళు. సన్నగా బలహీనంగా ఉండేవాడు. పుస్తకాల సంచీ భుజానికి తగిలించుకుని బెదురు బెదురుగా ఫస్టుఫారం క్లాసులోకి మొట్టమొదటి సారిగా అడుగు పెట్టాడు. అప్పటి కింకా క్లాసులోకి మాష్టారు రాలేదు. ముందుగానే స్కూలుకు వచ్చిన పిల్లలు క్లాసులో గొడవ చేస్తున్నారు. కొందరు బెంచీలమీద కూర్చుని ఏవో కబుర్లు చెప్పుకుంటున్నారు. కొందరు బోర్డుమీద సుద్దముక్కతో పిచ్చిపిచ్చి బొమ్మలు వేస్తున్నారు. ఇద్దరు కుర్రాళ్ళు ఎందుకో దెబ్బలాడుకుంటున్నారు. వాళ్లిద్దరి చుట్టూ పదిమంది చేరి రెండు పార్టీలుగా విడిపోయి ఎవరి పార్టీ కుర్రవాణ్ణి వాళ్ళు బలపరుస్తున్నారు. దెబ్బలాడుకుంటున్న కుర్రాళ్లల్లో ఒకడు తన ప్రత్యర్థి గుండెల మీద చేతులు వేసి బలంగా తోశాడు. ఇదంతా చూస్తూ కొంచెం దూరంలో నిలబడి ఉన్న తనమీదకి వచ్చి పడ్డాడు ఆ కుర్రాడు. తను పట్టుతప్పి కింద పడటంతో తల వెళ్లి గోడకు గుద్దుకుంది. తల దిమ్మెత్తిపోయింది. లేవలేక అలాగే ఉండిపోయాడు. ఇంతలో ఎవరో తనను లేవదీసి కూర్చోబెట్టి రెండు చెవులూ మూశారు. అప్పటికిగాని దిమ్ము తగ్గలేదు. ఏడవడం మొదలెట్టాడు.

"ఛ ఛ. ఇంతలోకే ఏడుస్తారా! చిన్న దెబ్బేగా! లే! లేచి నిలబడు" అన్న మాటలు విని తల పైకెత్తి చూచాడు. తనకంటే లావుగా ఎత్తుగా ఉన్న ఒక కుర్రవాడు తన చెయ్యి పట్టుకుని లేవనెత్తుతూ అంటున్నాడు. నెమ్మదిగా లేచి భుజాన ఉన్న సంచీ సర్దుకుని నిలబడ్డాడు.

"కొత్తగా వచ్చావా?" అడిగాడు అతను. తల ఊపాడు కళ్ళు తుడుచుకుంటూ.

"నా దగ్గిర కూర్చుందువు గాని రా" అంటూ చెయ్యి పట్టుకుని తీసుకువెళ్లి బెంచీమీద తన పక్కన కూర్చోబెట్టుకున్నాడు.

"నీ పేరేమిటి?" అడిగాడు కూర్చున్న తరవాత.

"మురళీకృష్ణ" అన్నాడు బెక్కుతూ.

అంతలో క్లాసులోకి మాస్టారు వచ్చారు. అందరూ లేచి నిలబడి ఆయన కూర్చున్న తరవాత నిశ్శబ్దంగా కూర్చున్నారు. మాస్టారు క్లాసంతా కలయ జూస్తూ తనవేపు చూచారు.

"కొత్తగా చేరావా? నీ పేరేమిటి?" అడిగారు.

లేచి నిలబడి పేరు చెప్పాడు. బలవంతంగా ఏడుపు ఆపుకోవడంవల్ల ఇంకా ఎక్కిళ్ళు వస్తూనే ఉన్నాయి.

"ఆదేమిటి అలా వెక్కుతున్నావెందుకు! ఏడ్చావా? ఏరా రాంబాబు, అతను ఎందుకు ఏడ్చాడు?" అడిగారు తన పక్కన ఉన్న కుర్రాణ్ణి. అప్పుడు తెలిసింది తనకు అతని పేరు రాంబాబని.

రాంబాబు లేచి నిలబడి జరిగింది చెప్పాడు. తమ ఇద్దరిని కూర్చోమని అంతకు ముందు దెబ్బలాడుకున్న కుర్రాళ్లను ఇద్దరిని దగ్గిరికి పిలిచి చెరో రెండు దెబ్బలు వేసి బెంచీ ఎక్కమన్నారు. ఆ బెంచెన్ను తీసుకున్న తరవాత బెంచీమీద నిలబడ్డ కుర్రాళ్లను కూర్చోమని పాఠం చెప్పడం మొదలు పెట్టారు.

ఆ రోజు సాయంత్రం స్కూలు విడిచి పెట్టాక తను రాంబాబు కలిసి బయటికి వచ్చారు. ఇంటికి వెళ్లబోతున్న తనను రాంబాబు అడిగాడు—"నీకేమి ఆటలు రావా?" అని.

"నాకు చేతకావు."

"పోనీ, మేము ఆడుతూ ఉంటే చూద్దువు గాని రా" అంటూ చెయ్యి పట్టుకుని గ్రౌండువేపు తీసుకువెళ్లాడు.

అంతకుముందే తన క్లాసు కుర్రాళ్ళు కొందరు అక్కడ చేరి చెడుగుడు ఆడుతున్నారు. రాంబాబును చూడగానే ఆట ఆపి, "రాంబాబు మావేపు" అంటూ అరుచుకుంటూ అతని చుట్టూ చేరారు.

అయిదు నిమిషాల్లో రెండు పార్టీలుగా విడిపోయి ఆట మొదలుపెట్టారు. తను రాంబాబు పుస్తకాలు కూడా ఒళ్లో పెట్టుకుని ఆట చూస్తూ కూర్చున్నాడు.

అరగంట తరవాత రాంబాబు పార్టీవాళ్ళు గెలిచారు. "హేయ్! మేము గెలిచామోచ్చి" అంటూ అంటూ అరవడం మొదలెట్టారు.

రెండో పార్టీ నాయకుడైన మోహన్ ఉక్రోషం పట్టలేక "ఏడిచారు! అనాథ శరణాలయంలో మొక్కలకు నీళ్లుపోసి బండబారిన చేతులున్నవాణ్ణి వేసుకుని గెలవడం గూడా గొప్పేనా?" అన్నాడు, ఎప్పుడు కూతకు వెళ్లినా రాంబాబు చేతుల్లో పట్టుబడిపోయిన అతను.

అంతవరకు నవ్వుతూ ఉన్న రాంబాబు మొహం మోహన్ అన్న మాటలకు ఒక్కసారిగా రంగులు మార్చుకుంది.

"ఏమిట్రా అన్నావు? మళ్ళా అను" అంటూ మోహన్ చొక్కా పట్టుకున్నాడు.

"ఏం! నేనన్నది తప్పా! ఒక్కసారేమిటి వంద సార్లంటాను" అన్నాడు ఎర్రగా బొద్దుగా ఉన్న మోహన్.

చాచిపెట్టి మోహన్ మొహం మీద కొట్టాడు రాంబాబు.

"అమ్మో! చచ్చాను" అంటూ రెండు చేతులు మొహం మీద పెట్టుకుని కూర్చుండిపోయాడు మోహన్.

"ఈసారి ఎప్పుడైనా ఆ మాట అన్నావంటే డొక్క చీరేస్తాను" అన్నాడు రాంబాబు చేతులు దులుపుకుంటూ తన దగ్గిరికి వచ్చి పుస్తకాలు అందుకుంటూ.

"చూడు నిన్నేం చేస్తానో. మా నాన్నగారితో చెప్పి నిన్ని ఊరిలోనే ఉండకుండా చేస్తాను" అంటూ పుస్తకాలు పట్టుకుని ఇంటిముఖం పట్టాడు మోహన్. రాంబాబు కొట్టిన దెబ్బకు అతని పెదవి చిట్లి రక్తం వచ్చింది.

తరవాత మిగతా పిల్లలందరూ నిశ్శబ్దంగా పుస్తకాలు పట్టుకుని ఇళ్లకు బయలుదేరారు. తను కూడా రాంబాబు ప్రక్కనే నడవడం మొదలెట్టాడు.

మోహన్ రాంబాబును అన్న మాటలకు అర్థం ఏమిటో, రాంబాబుకు ఎందుకు అంత కోపం వచ్చిందో తనకేమి అర్థమవలేదు. రాంబాబునే అడుగుదామని రెండు మూడుసార్లు ప్రయత్నం చేసి అతని మొహం చూచి అడిగే ధైర్యం లేక ఊరుకున్నాడు.

ఇద్దరూ కలిసి నాలుగురోడ్ల జంక్షను దగ్గిరికి వచ్చారు.

"మీ ఇల్లెక్కడ?" అడిగాడు రాంబాబు.

"అటువేపు." చెయ్యిపెట్టి చూపించాడు.

"సరే, ఇక వెళ్ళు" అంటూ కుడి వేపు తిరిగి తల వంచుకుని నడవడం మొదలెట్టాడు రాంబాబు.

* * *

"ఏరా! నాన్నా! ఇంత ఆలస్యమైందేం?" ఇంట్లోకి అడుగుపెడుతున్న తనని అమ్మ అడిగింది.

"మా క్లాసు పిల్లలు ఆడుకుంటూంటే చూస్తూ కూర్చున్నానమ్మా" అన్నాడు అమ్మ వెనకాతలే వంట ఇంటివేపు వెళుతూ.

అమ్మ ఒళ్లో కూర్చుని అన్నం తింటూ అడిగాడు తను:"అనాథ శరణాలయం అంటే ఏమిటమ్మా?"

"అనాథ శరణాలయం అంటే — తల్లీ తండ్రీ లేని పిల్లల్ని అక్కడ పెంచుతారు" అంది అమ్మ.

"మరి వాళ్లకు అన్నం ఎవరు పెడతారమ్మా?"

"అక్కడ ఉన్న పెద్దవాళ్ళు పెడతారు."

"మరి తినిపిస్తారా?" అమ్మ నోటికి అందించిన ముద్ద మింగుతూ అడిగాడు.

"మరీ చిన్న పిల్లలయితే తినిపిస్తారు."

"నా అంత పిల్లలకో?"

**బండారు రామకృష్ణారావు**

# అతని కోరిక



"నీ అంత పిల్లలు వాళ్ళే తింటారు. సరేగాని ఇవేమి ప్రశ్నలురా నీకు?" అడిగింది అమ్మ.

"ఏమి లేదమ్మా! మరేమో" అంటూ పొద్దున్న నుండి సాయంత్రం వరకూ స్కూల్లో జరిగినదంతా చెప్పాడు తను.

"ఆ రాంబాబుని మన ఇంటికి ఒకసారి తీసుకు రారా బాబూ" అంది అమ్మ తను చెప్పిందంతా విని.

రాంబాబుకు అమ్మా నాన్నా లేరంటే ఎందుకో తనకు నమ్మబుద్ధి వెయ్యలేదు. దెబ్బ తగిలి ఏడుస్తూ ఉన్న తనను లేవనెత్తి తీసుకువెళ్లి తన పక్కన కూర్చోబెట్టుకున్న అంత మంచి రాంబాబుకు అమ్మా నాన్నా లేరంటే, తన చిన్న మనస్సుకు ఏదో బాధ అనిపించింది.

మరునాడు తను క్లాసులో రాంబాబు పక్కనే కూర్చున్నాడు. మాస్టారు వచ్చి పాఠం చెప్పటం మొదలుపెట్టారు. ఇంతలో మోహన్‌తో పాటు ఒకావిడ క్లాసులోకి వచ్చి "ఏమండీ మాస్టారూ, ఎవడా రాంబాబుట! మా అబ్బాయిని పట్టుకుని చావ గొట్టాడు. చూడండి, వాడి పెదవి ఎలాగు వాచి పోయిందో. అనాథ శరణాలయంలో ఉన్నవాడంటే తప్పు వచ్చిందేం? దిక్కుమాలిన వెధవల్ని తీసుకువ తిండి బట్ట పెడుతున్నందుకు సంతోషించక పిల్ల పౌరుషాలు కూడాను. ఈసారి ఎప్పుడైనా ఇటువం పిచ్చిపనులు చేస్తే ఈ ఊరినుండే గెంటించేస్తాను నేనెవరనుకుంటున్నాడో" అంది గాలి దుమారంలా

మాస్టారి మీదికి విరుచుకు పడుతూ.

"ఏదో కుర్రవాళ్లు దెబ్బలాడుకుని ఉంటారు. దానికి మీరు ఇంత దూరం రావాలా? నేను మందలిస్తాను లెండి. మీరు వెళ్లండి" అన్నారు మాస్టారు నెమ్మదిగా.

"కుర్రాడవే ఈసారికి ఊరుకున్నాను. ఇంకొకసారి గాని ఇలాగు జరిగితే ఊరుకునేది లేదు" అంటూ బయటికి వెళ్లిపోయిందావిడ.

మోహన్ ఒకసారి గర్వంగా రాంబాబు వంక చూసి తన సీట్లోకి వెళ్లి కూర్చున్నాడు.

"ఏరా! రాంబాబూ, మోహన్ను ఎందుకు కొట్టావు?" అడిగారు మాస్టారు.

"నేనేమీ అనకుండా నన్ను నానా మాటలు అన్నాడు, సార్. కావాలంటే మురళిని అడగండి" అన్నాడు లేచి నిలబడి కళ్లు ఒత్తుకుంటూ రాంబాబు.

"అనాథ శరణాలయంలో మొక్కలకు నీళ్లు పోసేవాడన్నాడండీ రాంబాబుని" అన్నాడు తను లేచి నిలబడి ధైర్యంగా.

"ఏమోయ్ మోహన్! అలాగనవచ్చా! తప్పుకాదూ! ఒక క్లాసులో ఉండి చదువుకుంటున్నవాళ్లు అన్నదమ్ముల్లాగ ఉండాలి గాని దెబ్బలాడుకుంటారా. ఇంక కూర్చోండి. ఇంకెప్పుడూ ఇలాగ దెబ్బలాడుకోవద్దు" అంటూ తిరిగి పాఠం మొదలు పెట్టారు.

సాయంత్రం స్కూలు నుండి వస్తూ ధైర్యం చేసి అడిగాడు తను రాంబాబుని: "మీ ఇల్లెక్కడ?"

"నాకు ఇల్లు లేదు. అనాథశరణాలయంలో ఉంటాను."

"అంటే నీకు అమ్మా నాన్నా లేరా?" అడిగాడు తను ఇంకా సందేహంగానే.

"లేరు. వాళ్లెలాగుంటారో కూడా నాకు తెలీదు. నేను పుట్టినప్పటి నుండీ శరణాలయంలోనే ఉంటున్నాను."

"అయ్యో పాపం! మరి నీకు అన్నం ఎవరు తినిపిస్తారు?" అడిగాడు అమాయికంగా.

"అన్నం ఎవరో తినిపించడమేమిటి చిన్నపిల్లల్లాగ! నేనే తింటాను. నా పళ్లెం కూడా నేనే కడుక్కుంటాను." తనవేపు నవ్వుతూ చూస్తూ అన్నాడు.

"ఏం! నీకు అన్నం తినటం రాదా?" అడిగాడు రాంబాబు మళ్లా.

"వచ్చునుకో. అయినా మా అమ్మే తినిపిస్తుంది. నేను తింటానన్నా ఒప్పుకోదు."

రాంబాబు ముఖం ఎందుకో ఒక్కసారిగా గంభీరంగా మారింది. నాల్గు రోడ్ల జంక్షను దగ్గిరికి వచ్చేవరకు ఎవరూ ఏమీ మాట్లాడుకోలేదు.

"మా ఇంటికి వస్తావా?" అన్నాడు తను.

"ఇప్పుడు కాదులే. ఈసారి ఎప్పుడైనా వస్తాను." చకచకా నడుచుకుంటూ వెళ్లిపోయాడు.

'రాంబాబు ఎందుకు అలాగున్నాడబ్బా?' అనుకుంటూ ఇంటిముఖం పట్టాడు తను.

తరవాత తను రాంబాబును తన ఇంటికి రమ్మని చాలాసార్లు అడిగాడు. ఎప్పుడు పిలిచినా ఏదో ఒక సాకు చెప్పి తప్పించుకునేవాడు.

ఆరోజు తన పుట్టిన రోజు. పొద్దున్నే అమ్మ తలంటిపోసి కొత్త బట్టలు వేసింది. బడికి వెళ్లబోతూ ఉంటే అమ్మ అంది—"ఒరే బాబూ! సాయంత్రం ఎవరైనా నీ స్నేహితుల్ని తీసుకురా! పెరుగు గారెలు, మైసూరు పాకు చేస్తాను తిందురుగాని" అని. సరే నంటూ తల ఊపి బడికి బయలు దేరాడు.

'ఈ రోజు ఎలాగైనా సరే రాంబాబుని తన ఇంటికి తీసుకురావాలి' అనుకున్నాడు.

సాయంత్రం స్కూలు విడిచిపెట్టాక రాంబాబును అడిగాడు. "ఒరే రాంబాబూ! ఈ రోజు నా పుట్టిన రోజు. నీవు తప్పకుండా మా ఇంటికి రావలసిందే. కాదంటే ఒప్పుకునేది లేదు."

"పుట్టిన రోజా! అంటే ఏంజేస్తారు?"

"తలంటి పోసుకుని కొత్త బట్టలు వేసుకున్నానుగదా. ఇంక సాయంత్రం మా అమ్మ పెరుగు గారెలు, మైసూరుపాకు చేస్తానంది. అవి తినెయ్యడం. అంతే! మరి మా ఇంటికి రావురా?" బతిమాలుతూ అడిగాడు తను.

కొంచెంసేపు ఆలోచించి, "సరే, పద. వస్తాను" అన్నాడు.

తనకు ఐస్క్రీము తిన్నంత సంతోషం కలిగింది. 'రాంబాబు తన ఇంటికి వస్తున్నాడు. చక్కగా అమ్మ చేసినవన్నీ పెడతాను. తిన్న తరవాత మేడ మీదికి తీసుకువెళ్లి కారంబోర్డు ఆడుకుంటాం' అనుకున్నాడు సంతోషంగా.

"అమ్మా! రాంబాబును తీసుకువచ్చానే!" అరుచుకుంటూ ఇంట్లోకి వెళ్లాడు తను.

వంట ఇంట్లో నుండి బయటికి వచ్చింది అమ్మ. రాంబాబు బెదురు బెదురుగా ఒక పక్కన నిలబడ్డాడు తల వంచుకుని. "రా బాబూ! కూర్చో" అంది అమ్మ రాంబాబు చెయ్యి పట్టుకుని సోఫాలో తన పక్కన కూర్చో బెట్టుకుంటూ.

"అమ్మా! రాంబాబుకు క్లాసులో అన్నీ ఫస్టు మార్కులేనే. ఆటల్లోగూడా అతనే ఫస్ట్" అన్నాడు తను, తనే క్లాసులో ఫస్టు వచ్చినంత ఉత్సాహంగా, అమ్మకు రెండో పక్కన కూర్చుంటూ.

"అలాగా! బుద్ధిగా చదువుకుని పెద్దయ్యాక మంచి ఉద్యోగాలు చెయ్యాలి మీరిద్దరూ" అంది అమ్మ రాంబాబు భుజంమీద, తన భుజంమీద రెండు చేతులూ వేస్తూ. రాంబాబు సిగ్గుతో తల వంచుకుని కూర్చున్నాడు.

"అలా సిగ్గుపడతావేమయ్యా! ఉండండి, ఫలహారం తిందురుగాని" అంటూ వంట ఇంట్లోకి వెళ్లింది.

"మీ అమ్మగారు చాలా మంచివారురా? మురళీ" అన్నాడు రాంబాబు నెమ్మదిగా. తను గర్వంగా ఒకసారి గాలి పీల్చి వదిలిపెట్టాడు.

"మురళీ" అన్న అమ్మ కేకతో వంట ఇంట్లోకి వెళ్లాడు.

టేబిలు మీద పెరుగు గారెలు, మైసూర్ పాకు పళ్లాలు పెట్టి, "రాంబాబుని కూడా పిలుచుకు రా" అంది అమ్మ.

తను వెళ్లి పిలుచుకు వచ్చాడు. రాంబాబు వంట

తెల్ల వెంట్రుక లుండవు
పొగడడం మాకు ఇష్టంలేదు. కాని "మార్కేష్ రంజన్" ఆయుర్వేదిక్ సెంటెడ్ఆయిల్ తెల్ల వెంట్రుకలను నల్లగా మార్చును. మొదట తెల్లవి నల్లవిగా మారి, అటుపైన నల్లని వెంట్రుకలే వచ్చును, ఈఆయిల్ జ్ఞాపకశక్తి, కంటిచూపు వృద్ధి పరుచును. లాభంపొందినవారు 1000 పైగా మాకు వ్రాసియున్నారు.లాభం లేకున్న డబ్బు వాపసు. ధర రు. 10—.
BENGAL AYURVED BHAWAN (55)
P.O. Katri Sarai (Gaya)

డాక్టర్ వృత్తి చేయండి!

ఇంటో కూర్చొని పోస్టల్ ట్యూషనుద్వారా ప్రభుత్వంచే పరిగణింపబడిన సంస్థనుంచి హోమియోపతిలో మూడు అత్యున్నతమైన డిగ్రీలు, ఎం. డి.హెచ్., ఎం.ఎస్.సి. (హోమియో గోల్డు మెడలిస్ట్),పొందండి. పేర, డబ్బు గడించండి.ఉచితప్రాస్పెక్టసుకొరకు వ్రాయండి.
IMPERIAL HOMEOPATHIC COLLEGE (APW), Jammu Tawi-12.

చుండు


సాంపూగా ఉపయోగించినచో నికో సబ్బు చుండు రాకుండా రక్షణ నిస్తుంది. మరియు నికో సబ్బు రుద్దుకొని స్నానము చేసేతే శరీర దుర్గంధము లేకుండా పోతుంది.
నికో
క్రిమిసంహారక సబ్బు
పార్కు-డేవిస్ ఉత్పత్తి
NAS 6514b

హోటళ్ళు, రెస్టారాంట్లు...ఆసుపత్రులు, హాస్టళ్ళు

కాల్ గాస్ తో



డబ్బును
కాలాన్ని
ఆదాచేసుకొనండి

CALGAS



కాల్ గాస్ కేంద్రీకృతమైన వేడినిచ్చి వంట కాలాన్ని గంటలకొద్దీ తగ్గిస్తుంది. దీన్ని కావలసినట్లు వెలిగించుకోవచ్చు, ఆర్పుకోవచ్చు. ఈ విధంగా కాల్ గాస్ డబ్బునూ, కాలాన్ని ఆదాచేస్తుంది.

కాల్ గాస్ భద్రమైనది

కాల్ గాస్ మీకు భద్రమైన ఉక్కు సిలెండర్లలో ప్రత్యేకమైన రక్షణ టోపీలతో చేరుతుంది. ఇవి లీకేజీని, తప్పువాడకాన్ని లేకుండా చేస్తాయి.

*ఇంటిదగ్గర బట్వాడాచేసే సౌకర్యం ఉంది.*

A CALTEX PRODUCT

పోల్ డిస్ట్రిబ్యూటర్ : ఈస్ట్ కోస్ట్ గాస్ కంపెనీ

48/9/5,కో—ఆపరేటివ్ కాలనీ, ద్వారకానగర్, విశాఖపట్నం—4. ఫోన్ : 3516.
కనమెరా ఎనెక్స్, మౌంట్‌రోడ్డు, మద్రాసు—2. ఫోన్ : 83428.

**ఏజెంట్లు ఉన్నచోట్లు :** విశాఖపట్నం • మద్రాసు • విజయవాడ • కాకినాడ • ఏలూరు గుంటూరు • కటక్ • రాజమండ్రి • నెల్లూరు • గూడూరు (నెల్లూరు జిల్లా) • తిరుపతి బరంపురం • పాలకొల్లు • విజయనగరం • మచిలీపట్నం • కాట్పాడి • సేలం • పుదుచ్చేరి ఒంగోలు • దుర్గ్ • వరంగల్ • కాంచీపురం • భువనేశ్వర్.

CAL. GAS. G. 7.64

# అతని కోరిక

ఇంటి గుమ్మంలోనే నిలబడిపోయాడు.

"రా బాబూ. పరవాలేదు. సిగ్గు పడకు" అంటూ చెయ్యి పట్టుకుని తీసుకువచ్చి కుర్చీలో కూర్చోబెట్టి, "ఇంక తినండి" అంది.

రాంబాబు తల వంచుకుని నెమ్మదిగా తినడం మొదలు పెట్టాడు.

"రెండు మైసూరుపాకులు వెయ్యనా?" అంది అమ్మ.

"వద్దండీ! ఇప్పటికే కడుపు నిండిపోయింది" అన్నాడు రాంబాబు.

"ఈ పాయసం తాగండి" అంటూ రెండు గ్లాసుల సేమ్యా పాయసం తెచ్చి పెట్టింది.

తాగడం పూర్తి అయ్యాక ఇద్దరూ కలిసి బయటికి వచ్చారు.

"పెరుగు గారెలు, మైసూర్‌పాకులు భలేగా ఉన్నాయిరా, మురళీ! పాయసం చెప్పనే అక్కరలేదు. మీ అమ్మగారు భలేగా వండారురా " అన్నాడు రాంబాబు.

"మా అమ్మకు చాలా రకాల పిండివంటలు వచ్చు మా నాన్నగారు కూడా మా అమ్మ వంటల్ని భలే మెచ్చుకుంటారు."

"మీ నాన్నగారేరిరా?"

"ఇంకా కోర్టునుండి రాలేదు."

"కోర్టా! అంటే?"

"మా నాన్నగారు ప్లీడరురా."

"ఓ, నల్ల కోటు తెల్ల పంట్లాం వేసుకుంటారు. తెలిసింది. మా శరణాలయం ముందు కూడా ఒక ప్లీడరుగారు ఉన్నారు"అన్నాడు రాంబాబు.

"మీ శరణాలయంలో ఎంతమంది ఉంటారురా?"

"అబ్బో, వందమందికి పైనే ఉంటారు."

"వందమందే! వాళ్ళందరికి అమ్మా నాన్నలు లేరన్నమాట" అన్నాడు తను ఆశ్చర్యంగా అతనివంక చూస్తూ.

"లేరు." ముక్తసరిగా అన్నాడు.

"పదరా! మేడమీదికి వెళదాం" అన్నాడు తను అతని మొహంలో రంగులు మారడం గమనించి.

ఇద్దరూ కలిసి మేడమీదికి వెళ్ళారు. తను మూలనున్న చాప తీసి పరిచి కారంబోర్డు తెచ్చి పెట్టాడు. కొంచెంసేపు ఆడిన తరవాత, "ఇంక నేను వెళతానురా, మురళీ! ఇప్పటికే ఆలస్యమైంది" అన్నాడు రాంబాబు. ఇద్దరూ కిందికి దిగి వచ్చారు.

అప్పుడే గుమ్మంలో అడుగుపెడుతున్న నాన్నగారు తనను చూసి, "ఒరే, మురళీ! నీకేం తెచ్చానో చూడు" అంటూ జేబులోనుండి కొత్తపెన్ను తీసి ఇచ్చారు.

"అబ్బ! ఎంత బాగుందో! అరే, రాంబాబూ! చూడరా, మా నాన్నగారు తెచ్చిన పెన్ను ఎంత బాగుందో!" అన్నాడు రాంబాబువైపు తిరిగి పెన్ను అతనికి ఇస్తూ.

రాంబాబు పెన్ను తీసుకుని కొంచెంసేపు అటూ ఇటూ తిప్పి, "చాలా బాగుందిరా!" అన్నాడు తిరిగి ఇచ్చేస్తూ.

"ఆ అబ్బాయి ఎవరురా?" అడిగారు నాన్నగారు.

''రాంబాబు, నాన్నా! మా క్లాసె. నా ఫ్రెండ్. నా పుట్టిన రోజని తీసుకువచ్చాను'' అన్నాడు తను గుక్క తిప్పుకోకుండా.

''మీ నాన్నగారి పేరేమిటోయ్?''

''నాకు అమ్మా నాన్నా లేరండీ. అనాథ శరణాలయంలో ఉంటాను'' అన్నాడు రాంబాబు తల వంచుకుని.

''ఓ! అయామ్ సారీ'' అన్నారు నాన్నగారు ఏదో తప్పు చేసినవారిలాగా.

''మా మురళి బాగా చదువుతున్నాడా? మీకు మార్కులు ఎలా వస్తున్నాయి?'' అన్నారు వెంటనే ప్రసంగం మార్చేస్తూ.

''క్లాసులో రాంబాబే ఫస్టు, నాన్నా.''

''అలాగుటోయ్. వెరీ గుడ్! బాగా చదవాలి'' అన్నారు నవ్వుతూ రాంబాబు భుజంమీద చెయ్యి వేసి.

రాంబాబు ముఖం వికసించింది. ''ఇంక నేను వెళతానండీ'' అన్నాడు.

''రోజూ మా ఇంటికి వచ్చి మా మురళీ నువ్వూ కలిసి ఆడుకోండోయ్'' అంది అమ్మ వరాండాలో నిలబడి. తల ఊపాడు రాంబాబు.

''వస్తానురా, మురళీ'' అంటూ పుస్తకాలు పట్టుకుని బయలుదేరాడు.

''ఆ అబ్బాయి ముఖం చూశారా ఎంత కళగా ఉందో! పాపం, తలిదండ్రులకు నోచుకోలేదు'' అంది అమ్మ నాన్నగారి వెనకాతలే ఇంట్లోకి వెళుతూ.

''అవును. పాపం, దురదృష్టవంతుడు'' అన్నారు నాన్నగారు కోటు విప్పుతూ.

ఆ విధంగా మొదలయిన తన స్నేహం ఆఖరికి తను రాంబాబును, రాంబాబు తనను ఒక్క రోజు చూసుకోపోతే ఉండలేని స్థితికి తీసుకువచ్చింది.

స్కూలుఫైనలు ఫలితాలు వచ్చాయి. రాంబాబు స్కూలు అంతటికీ మొదటివాడుగా పాసు అయ్యాడు. తను మామూలుగా పాసు అయ్యాడు. సంతోషం పట్టలేక తను వెళ్ళి రాంబాబును కౌగిలించుకున్నాడు.

తనతోపాటే ఇంటికి వచ్చిన రాంబాబును ''ఏమయ్యా, స్కూలు అంతటికి ఫస్టున పాసయ్యావుట. చాలా సంతోషం, నాయనా!'' అంది అమ్మ.

''కంగ్రాచ్యులేషన్స్ టు బోత్ ఆఫ్ యూ'' అన్నారు నాన్నగారు గదిలోనుండి వస్తూ.

''థాంక్స్'' అన్నారు ఇద్దరూ ఒక్కసారిగా.

వారం రోజులు పోయాక రాంబాబును అడిగాడు తను, ''కాలేజీలో ఏం గ్రూపు తీసుకుంటావ''ని.

''కాలేజీ ఏమిట్రా?''

''కాలేజీలో చదవవు మరి?''

''నా కెవరు చెప్పిస్తారురా! శరణాలయం వాళ్ళు ఇంతకంటే ఎక్కువ చెప్పించరు. నా కాళ్ళమీద నేను నిలబడగలిగేంతవరకే వాళ్ళ బాధ్యత. తరవాత ఎవరి దారి వాళ్ళదే. ఏదైనా ఉద్యోగంకోసం ప్రయత్నం చెయ్యాలి.''

రాంబాబు మాటలు విన్న తరవాత తనకు ఏమనాలో తోచలేదు. 'రాంబాబు కాలేజీలో చేరాలి. ఇంకా చదవాలి. కాని ఎలాగ? ఎవరు చెప్పిస్తారు?' ఈ విధంగా ఆలోచించుకుంటూ ఇంటికి వస్తున్న తనకు తళుక్కున ఒక ఆలోచన తట్టింది. 'నాన్నగారిని చదివించమంటే? అవును. నాన్నగారికి అమ్మకు తను చెబితే వాళ్ళు కాదనరు. తను వాళ్ళకు ఒకడే కొడుకు. డబ్బు కూడా బాగానే ఉంది. అమ్మా నాన్నలకు కూడా రాంబాబంటే చాలా ఇష్టం. అంతే! నాన్నగారిని అడగాలి' అనుకుంటూ గబగబా ఇంటికి నడిచాడు.

వంట ఇంట్లో ఉన్న అమ్మదగ్గిరికి వెళ్ళాడు ముందు. ''అమ్మా! రాంబాబుకు ఇంక శరణాలయం వాళ్ళు చదువు చెప్పించరుట. ఏదైనా ఉద్యోగం చేసుకోవాలిట.''

''అయ్యో, పాపం, అలాగా!''

''అమ్మా! ఒక్క మాట అడగనా?'' అన్నాడు నెమ్మదిగా.

''ఏమిటిరా అది!'' అంది అమ్మ తనవేపు తిరుగుతూ.

''మనమే రాంబాబుకు చదువు చెప్పిస్తే'' అన్నాడు అమ్మ సమాధానంకోసం ఆత్రంగా ఎదురుచూస్తూ.

కొంచెంసేపు ఆలోచించి, ''బాగానే ఉంటుందనుకో. నాన్నగారు ఒప్పుకోవాలి కదా!'' అంది.

అమ్మకు ఇష్టమేనని తెలిగానే తనకు వెయ్యి ఏనుగుల బలం వచ్చింది.

''నువ్వు చెబితే నాన్నగారు కాదనరమ్మా! నాన్నగారికి కూడా రాంబాబంటే ఇష్టమేగా.''

''సరే. నాన్నగారు రానీ, చెబుతాను.''

''నువ్వెంతో మంచిదానవని రాంబాబు ఎప్పుడూ అంటుంటాడమ్మా. నిజంగా నువ్వు చాలా మంచిదానివి'' అన్నాడు సంతోషంగా.

''పోరా, పిచ్చివాడా! ఆ మాత్రం సహాయం చెయ్యడం కూడా గొప్పేనా! భగవంతుడు మనకు ఇచ్చాడు. దానిలోనే సహాయం చేస్తున్నాం.''

'మా అమ్మ నిజంగా దేవత!' మనస్సులోనే అమ్మకు దణ్ణం పెట్టుకుని బయటకు వచ్చి నాన్నగారు ఎప్పుడు వస్తారా అని ఎదురుచూడ్డం మొదలుపెట్టాడు.

నాన్నగారు వచ్చాక ఇద్దరికీ వడ్డించి, భోజనం చేస్తూంటే అంది అమ్మ: ''ఏమండీ! రాంబాబును ఇంక శరణాలయం వాళ్ళు చదివించరట. ఏదైనా ఉద్యోగం చూసుకోవాలిట.''

''అరే పాపం! చాలా తెలివైనవాడు. అటువంటి వాళ్ళకే అవకాశాలు ఉండవు'' అన్నారు.

''పోనీ, ఆ అవకాశం మనమే కలిగిస్తే?''

''అంటే?'' అన్నారు అమ్మవైపు తిరిగి.

''అదే! మనమే రాంబాబును చదివిస్తే?''

నాన్నగారు అన్నం తినడం ఆపి కంచంలో చెయ్యి పెట్టి ఆలోచిస్తున్నారు. ఏమంటారో అని కొట్టుకుంటున్న గుండెలతో ఆయన వైపే చూస్తూ కూర్చున్నాడు తను.

''ఆల్ రైట్! అటువంటి వాడికి సహాయం చేసినా మాట దక్కుతుంది'' అన్నారు తిరిగి అన్నం కలుపుతూ.

తన ఆనందానికి హద్దులు లేవు. రాంబాబు కూడా కాలేజీలో చేరతాడు. ఇంక తనకేం కావాలి? అమ్మ దేవతైతే నాన్నగారు దేవుడు. మనస్సులోనే వాళ్ళిద్దరికి దణ్ణం పెట్టుకున్నాడు.

''ఏరా మురళీ, ఈ ఆలోచన నీదేనా?'' అడిగారు నవ్వుతూ తనవైపు చూస్తూ. తల ఊపాడు చిన్నగా నవ్వుతూ.

గబగబా అన్నం తినడం కానిచ్చి శరణాలయంవైపు పరిగెత్తాడు తను.

''ఏరా, ఇంత ఎండలో వచ్చావు?'' అడిగాడు రాంబాబు వగరుస్తూ ఉన్న తనను చూసి.

''ఒరే! ఒక శుభవార్త పట్టుకువచ్చాను. ఏమిటో చెప్పుకో?'' అన్నాడు రాంబాబు రెండు చేతులూ పట్టుకుంటూ.


''ఏమిటబ్బా, ఆ శుభవార్త? ఆఁ, తెలిసింది! నీకు పెళ్ళి సంబంధం వచ్చి ఉంటుంది'' అన్నాడు నవ్వుతూ.

''ఛ ఛ. నీ ముఖం! ఇప్పుడు పెళ్ళేమిటిరా! ఓరి పూలా! శుభవార్త నన్ను గురించి కాదురా! నిన్ను గురించే!''

''నన్ను గురించా! అయితే మీ నాన్నగారు నా కేదైనా ఉద్యోగం చూసిపెడదామనుకుంటూరా.''

''ఏడిశావ్, నీ మొహం! అదేమి కాదు. మా నాన్నగారు నిన్ను కాలేజీలో చదివిస్తామన్నారు'' అన్నాడు చివరికి.

రాంబాబు మొహం ఒక్కసారే వికసించింది. కాని,



బరిమీద ఫణి

ఫోటో—ఎ. ఎల్. కాంతారావు (సికిందరాబాదు)

మరుక్షణంలోనే ముడుచుకుంది.

''అదేమిటిరా, మొహం అలా పెట్టావు?'' అన్నాడు తను నీరసంగా.

''మీ నాన్నగారు అమ్మగారు మనుషులు కాదురా! దేవుళ్ళు! అటువంటి తలిదండ్రులు ఉన్న నీవు అదృష్టవంతుడివి. కానీ, వాళ్ళను బాధ పెట్టదలుచుకోలేదురా! కాలేజీలో చదవాలంటే బోలెడు డబ్బు కావాలి. నిన్ను, నన్ను కూడా చదివించాలంటే వాళ్ళకు ఎంత కష్టం! నా కేదైనా ఉద్యోగం ఇప్పించమని చెప్పు మీ నాన్నగారితో నా కదే చాలు.''

''ఓరి! ఇదా నీ బాధ! డబ్బేముందిరా? భగవంతుని దయవల్ల మా కందుకు లోటు లేదు. నేను మాత్రం వాళ్ళకు ఒక్కణ్ణే కదా.''

''వద్దురా, మురళీ! నా కెందుకో ఇష్టంలేదు.''

(తరువాయి 39 వ పేజీలో)

# అతని కోరిక

(37వ పేజీతరువాయి)

''సరే అయితే! నేను కూడా కాలేజీలో చేరను.''

''ఆదేం?'' అన్నాడు ఆశ్చర్యంగా.

''ఇంతే నన్నమాట నీవు నన్ను అర్థం చేసుకున్నది. నీతోపాటే నేను కూడాను. నీవు కాలేజీలో చేరితేనే నేను కూడా చేరతాను. లేకపోతే లేదు'' అన్నాడు తను తీవ్రంగా.

ఒక్కసారిగా రాంబాబు తనను కౌగిలించుకున్నాడు.

''మురళీ, నీ వెంత మంచివాడవురా! నీలాంటి స్నేహితుడు దొరకడం నా అదృష్టమేరా! సరే! నీ ఇష్ట ప్రకారమే కానీ. ఇద్దరం కలిసే కాలేజీలో చేరదాం.''

* * *

వారం రోజుల తరవాత ఇద్దరూ బెజవాడ కాలేజీలో చేరారు. తరవాత నాలుగేళ్ళూ ఇట్టే గడిచిపోయాయి. రాంబాబు బి. ఎస్‌సి. తను బి. ఎ. పరీక్షలు వ్రాసి ఇంటికి వచ్చారు. కొద్ది రోజుల్లోనే ఫలితాలు కూడా వచ్చాయి. రాంబాబు బి. ఎస్‌సి. మొదటి తరగతిలో పాసయ్యాడు. తను మామూలు క్లాసులో పాసయ్యాడు.

''తరవాత ఏం చదువుతారోయ్?'' అడిగారు నాన్నగారు.

''ఏముందీ! రాంబాబు ఎమ్. ఎస్‌సి. లోనూ, నేను లాలోనూ చేరతాం'' అన్నాడు తను.

''లేదండీ! ఇంక నేను చదవను. ఏదైనా ఉద్యోగంలో చేరతాను'' అన్నాడు రాంబాబు.

''అదేమిటోయ్! ఎమ్. ఎస్‌సి.లో చేరు. మధ్యలో ఆపేస్తే ఎలా?''

''వద్దు, సార్! ఇప్పటికే నేను మీకు చాలా ఋణపడి ఉన్నాను. ఇంకా మిమ్మల్ని కష్టపెట్ట దలుచుకోలేదు. దయ ఉంచి ఇంక నన్ను బలవంతం చెయ్యకండి. పూర్వ జన్మలో నేనేదో పుణ్యం చేసుకున్నాను. అందుకనే మురళీ స్నేహం, మీ ఆదరణ లభించాయి. ఎన్ని జన్మ లెత్తినా మీ ఋణం తీర్చుకోలేను. ఏదైనా ఉద్యోగం చేసుకుని బ్రతుకుతాను. మీ మాట కాదన్నందుకు క్షమించండి.'' కృతజ్ఞతతో అతని కళ్ళలో నీళ్ళు నిండాయి.

నాన్నగారు కూడా ఇంక అతణ్ణి బలవంతపెట్టలేదు. అతని పట్టుదల తనకు తెలుసు కాబట్టి తను కూడా ఏమీ అనలేదు.

''సరే, నీ ఇష్టం! హైదరాబాదులో నా స్నేహితుడు ఒకడు ఉన్నాడు. అతనికి ఉత్తరం వ్రాసి ఇస్తాను. నీవు అక్కడికి వెళ్ళు. ఏదైనా ఉద్యోగం ఇప్పిస్తాడు'' అన్నారు నాన్నగారు.

''చాలా థాంక్సండీ! మీ ఋణం ఎలా తీర్చుకోవాలో కూడా నాకు తెలీడంలేదు. దిక్కులేని నన్ను చేరదీసి ఒక మనిషిని చేశారు.'' నీళ్ళతో నిండిన కళ్ళు ఒత్తుకుంటూ అన్నాడు.

''ఏమిటోయ్, మరీ అంత ఇదవుతావు! ఇందులో మేము చేసిం దేముంది? అంతాఆ భగవంతుని దయ.''

నాన్నగారు ఇచ్చిన ఉత్తరం పట్టుకుని రాంబాబు హైదరాబాదు, లాలో చేరడానికి తను విశాఖపట్టణం బయలుదేరారు.

విశాఖపట్టణం వెళ్ళిన వారం రోజుల్లోనే రాంబాబు దగ్గరనుండి ఉత్తరం వచ్చింది. హైదరాబాదులో ఏదో ఫార్మస్యూటికల్ కంపెనీలో కెమిస్టుగా ఉద్యోగం వచ్చిం దనీ, నాన్నగారి స్నేహితులే ఆ ఉద్యోగం ఇప్పించారనీ, జీతం మూడు వందలనీ దానిలో వ్రాశాడు.

తరవాత తరుచుగా వారు ఇద్దరూ ఉత్తరాలు వ్రాసుకుంటూండేవారు.

ఎఫ్. ఎల్. పరీక్షలు వ్రాసి ఇంటికి వెళ్ళాడు తను. రాంబాబు సెలవుపెట్టి హైదరాబాదునుండి వచ్చాడు. హైదరాబాదులో ఉన్న ఒక్క సంవత్సరంలో అతనిలో చాలా మార్పు వచ్చింది. ఇదివరకటికంటే హుషారుగా ఉన్నాడు.

''ఏమిటిరోయ్! మనిషివి చాలా మారావు. హైదరాబాదు నీళ్ళు బాగా వంటబట్టిన ట్లున్నాయే'' అన్నాడు తను.

''దానికి కారణం ఉందిరా! నెమ్మదిగా చెబుతాను'' అన్నాడు నవ్వుతూ.

''ఏడిశావ్! అదేదో త్వరగా చెప్పు. ఏదైనా ప్రేమ వ్యవహారమా?''

నవ్వి ఊరుకున్నాడు.

భోజనంచేసి ఇద్దరూ వచ్చి హాల్లో కూర్చున్నారు.

''ఒరే! ఇందాకా ఏదో చెబుతానన్నావు చెప్పరా.'' అడిగాడు కుతూహలంగా.

''ఉండరా, నీ కంతా తొందరే. అమ్మనీ నాన్నగారినీ కూడా రానీయ్.''

''ఏమిటోయ్! మేము కూడా రానీ అంటున్నావు'' అంటూ హాల్లోకి వచ్చారు నాన్నగారు. వెనకాతలే అమ్మ కూడా వచ్చింది.

''అబ్బే, ఏమి లేదండి! మీతో ఒక విషయాన్ని గురించి చెబుదామని.'' నాన్నాడు తల వంచుకుని.

''ఏమిటోయ్, ఆ విషయం? నీ సిగ్గు బంగారం గానూ! ఇంకా నీకు సిగ్గు పోలేదా? ఉద్యోగం కూడా చేస్తున్నావే'' అంది అమ్మ నాన్నగారి పక్కన సోఫాలో కూర్చుంటూ.

''మరండీ! నాకు హైదరాబాదులో ఒక అమ్మాయితో పరిచయమైంది. మా కంపెనీలోనే పని చేస్తోంది. ఆమె కూడా నాలాగే అనాధ శరణాలయంలో పెరిగింది. స్కూలుఫైనలు పాసయింది. ఆమెను పెండ్లి చేసుకుందా మనుకుంటున్నానండి. మరి మీ ఉద్దేశ్యం?...'' అంటూ ఆపేశాడు.

''చాలా సంతోషమయ్యా! నీవు చేస్తున్న పని చాలా గొప్పది. నీవు ఆ అమ్మాయినే పెండ్లి చేసుకుని పది కాలాలపాటు సుఖంగా ఉండాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను'' అన్నారు నాన్నగారు సంతోషంగా.

''మన రాంబాబు ఏ పని చేసినా మంచి పనే చేస్తాడు'' అంది అమ్మ.

''ఇంతకు ఎవ్వరా అమ్మాయి? నామధేయం బెయ్యది ఎటుల నీవు ప్రేమలో పడితివి? సర్వమూ విశదీకరించుము, సోదరా'' అన్నాడు తను నాటక ఫక్కీలో—అమ్మ నాన్నగారు అక్కడినుండి వెళ్ళిపోగానే.

''పోరా! నీదంతా వేళాకోళం.''

''పోనీ, నిజంగానే అడుగుతున్నాను, చెప్పరా బాబూ తహతహలో పెట్టి చంపక'' అన్నాడు బ్రతిమాలుతూ.

''ఆ అమ్మాయి పేరు జ్యోతి. చెప్పానుగా మా

పండిత
డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు-17

ఇంగ్లీష్ టెరిలిన్

పాంట్, షర్టు ముక్కలు (1.25 & 2.15 మీటరు) రెండు ముక్కలకు క్లియరెన్సు అమ్మకపు ధర రు. 25/-లు. రెండుసెట్లు (2.50 & 4.30 మీటరు) రు. 48/-లు. సూటు నిడివి ఇంగ్లీష్ టెరిలిన్ (3.మీటర్లు) రు. 40/-. వి.పి.పి. చార్జీలు రు. 2-50.
ARVIND AGENCIES (WAP-25),
Box 1408, Delhi-6.

క్రుషెన్ సాల్టులు
తీసుకోండి
వీటితో
మీ ఆకలి
అధికమగును


క్రుషెన్ సాల్టుల
7 విధముల పని
మిమ్ము స్వస్థతగా
నుంచును!
నికోలస్ వారి (N) తయారు
7 గ్నాతకు మందు శుద్ధతకు మీకు గ్యారంటీ కలద
KS.G.4.TEL

# అతని కోరిక

కంపెనీలోనే పని చెస్తూందని. ఒక రోజు కింగ్‌కోఠీ రోడ్డుమీదుగా వెళుతూ ఉంటే ఇద్దరు రౌడీలు ఒక అమ్మాయిని అల్లరి చెయ్యడం చూశాను. వెళ్ళి ఇద్దరినీ పట్టుకుని చావ బాది వదిలిపెట్టాను. వాళ్ళు పారిపోయిన తరవాత ఆ అమ్మాయిని చూద్దును గదా! మా ఆఫీసులో పని చెస్తున్న అమ్మాయే! అంతవరకు ఆ అమ్మాయి పేరు కూడా తెలీదు, ఆఫీసులో అప్పుడప్పుడు చూడ్డం తప్ప. ఆ అమ్మాయి కూడా నన్ను గుర్తు పట్టింది. 'చాలా థాంక్సండీ! మీరు రాకపోతే నా గతే మయ్యేదో! సమయానికి దేవుడిలాగ వచ్చి కాపాడారు' అంది. 'దానికేముంది లెండి. పదండి. మీ ఇంటి దగ్గిర దింపి వస్తాను' అన్నాను. దారిలో తన పేరు, ఎక్కడ పుట్టి పెరిగింది చెప్పింది. నేను కూడా నన్ను గురించి చెప్పాను. ఆ విధంగా పరిచయమైంది మాకు. రోజూ ఆఫీసు అయిన తరవాత ఇద్దరం కలుసుకుంటూ ఉండేవాళ్ళం. మా ఇద్దరి జీవితాలు పుట్టిన దగ్గిరనుండి ఒకేలాగు నడిచాయని తెలుసుకున్నాం. ఆమెనే పెళ్ళి చేసుకుందా మనుకున్నాను. అడిగేశాను కూడా. సంతోషంగా ఒప్పుకుంది. అమ్మకు నాన్నగారికి చెప్పి వాళ్ళ అనుమతి తీసుకుందామని వచ్చాను. ఇంతకూ నీ వేమంటావో కూడా చెప్పు.''

''నే నేమనడ మేమిటిరా నీ తలకాయ! నీవు పెళ్ళి చేసుకుంటున్నావంటే, అందులోను ప్రేమించి పెళ్ళాడుతున్నావంటే నా కంతకం టె సంతోషకరమైంది ఇంకేముంటుంది?''

హైదరాబాదు యువతీ మండలి ఆవరణలో పుర ప్రముఖుల సమక్షంలో జ్యోతి మెడలో మంగళసూత్రం కట్టాడు రాంబాబు. తను, అమ్మ, నాన్నగారు హైదరాబాదు పెళ్ళికి వెళ్ళారు.

నల్లకుంటలో ఒక ఇల్లు తీసుకుని కాపరం పెట్టాడు రాంబాబు. నాలుగు రోజులు హైదరాబాదులో ఉండి ఇంటికి వచ్చాక విశాఖపట్నం వెళ్ళిపోయాడు తను.

* * *

తరవాత రెండు సంవత్సరాలూ తన జీవితంలో చాలా మార్పులు తీసుకువచ్చాయి.

బి. ఎల్. పరీక్షలు వ్రాసిన వెంటనే శారదతో తన పెళ్ళి నిశ్చయమైపోయింది. నెల రోజులలోనే పెళ్ళి కూడా జరిగిపోయింది. పెళ్ళికి రాంబాబు, జ్యోతి కూడా వచ్చారు. పెళ్ళి పందిరి అంతా వా ళ్ళిద్దరే అయి తిరిగారు.

హడావిడి అంతా అయిపోయిన తరవాత రాంబాబు తన దగ్గిరికి వచ్చాడు.

''ఏరా, భాయ్! ఎలాగుంది మా మరదలు'' అన్నాడు నవ్వుతూ.

''ఎలాగుండడ మేమిటిరా! చూస్తూనే ఉన్నావు గదా. ఇంతకూ మీ సంసారం ఎలాగుందో చెప్పవోయ్. మాదేముంది, ఇంకా కొత్త. మా వదినగారు బాగా చూసుకుంటూందా నిన్ను?''

''మీ వదిన నన్నెలా చూస్తూందో నా మొహమే చెబుతూంది కదరా. ఇంక వేరే చెప్పడ మెందుకు?''

'నిజమే. ఇప్పుడు రాంబాబు మొహంలో ఒక విధమైన తృప్తివల్ల వచ్చె మెరుపు ఉంది' అనుకున్నాడు మనస్సులో.

''మిమ్మ ల్సిద్దరినీ చూస్తూంటే నాకు చాలా ఆనందంగా ఉందిరా. కలకాలం మీ రిలాగే ఉండాలని కోరుకుంటున్నాను'' అన్నాడు తను.

''రేపే హైదరాబాదు వెళుతున్నాంరా. మీరు కూడా మా వెంట రావాలి.''

''మేమా! మే మెందుకు?''

''ఒకసారి హనీమూన్ ట్రిప్పులాగ రండోయ్.''

''మా హనీమూన్ ఇంట్లోనే గడిపేస్తాం గాని ఈసారి ఎప్పుడైనా వస్తా. నీకు కూడా ఇంత తొందరేం? రెండు రోజులు ఉండి వెళ్ళకూడదూ?''

''వీలుపడదురా! సెలవు లేదు. అయినా మళ్ళీ ఏడాది బారసాలకు వస్తాం గదా?''

''బారసాల ఎవరికిరా?'' అన్నాడు అర్థంకాక.

''ఆదేనోయ్! వచ్చే ఏటికల్లా తండ్రివి కావా మరి?'' అన్నాడు నవ్వుతూ.

''ఏడిశావులే! ముందు నీ సంగతి చూడు. పెళ్ళి అయి సంవత్సరం దాటిపోయింది.''

''ఇంకా అటువంటి దేమీ లేదురా! హాయిగా గడిపేస్తున్నాం.''

జ్యోతి, రాంబాబు హైదరాబాదు వెళ్ళిపోయారు. వెళ్ళేముందు అమ్మ, నాన్నగారు వాళ్ళకు చాలా కానుకలు ఇచ్చి పంపారు. వెళుతున్న రాంబాబును చూసి అమ్మ ఎందుకో కళ్ళనీళ్ళు పెట్టుకుంది. ''జాగ్రత్త బాబూ! ఉత్తరాలు వ్రాస్తూండు'' అంది.

తన పరీక్ష ఫలితాలు రావడం, పాసవడం, ఎప్రెంటిస్ అయిపోయిన తరవాత నాన్నగారి దగ్గిరే జూనియర్‌గా పని చెయ్యడం అన్నీ ఒకదాని వెంట ఒకటి జరిగిపోయాయి.

మరుచటి సంవత్సరమే శారద మగపిల్లవాణ్ణి ప్రసవించింది. కాని, కాన్పు చాలా కష్టమవడంవల్ల ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది. ఈసారి గర్భం ధరిస్తే తల్లి ప్రాణానికే ముప్పని ఇంక పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేసేశారు. పుట్టిన పిల్లవాడు కూడా రెండు రోజులే బతికాడు. పిల్లవాడు పోవడంతో ఇంక తనకు పిల్లలు పుట్టరని తెలుసుకున్న శారదను ఓదార్చడానికి తను చాలా కష్టపడవలసి వచ్చింది.


ఇది జరిగిన ఆరు నెలలకే నాన్నగారు కోర్టులో కేసు వాదిస్తూ గుండెనొప్పి వచ్చి కుర్చీలో కూర్చున్న వెంటనే ప్రాణం వదిలారు. ఆ వార్త విన్న అమ్మ నిలుచున్న పాటునే శాశ్వతంగా నేల కూలిపోయింది.

ఈ వార్త తెలిసిన రాంబాబు హైదరాబాదునుండి పరిగెత్తుకువచ్చాడు. అతన్ని ఓదార్చడం ఎవరితరము కాలేదు. ఆఖరుకు తనుకూడా తన దుఃఖాన్ని దిగమింగుకుని అతన్ని ఓదార్చడానికి ప్రయత్నించాడు. కర్మకాండ లన్నీ పూర్తి అయాక రాంబాబు హైదరాబాదు వెళ్ళిపోయాడు. ఇంకంత ఇంట్లో తను, శారద మాత్రం మిగిలారు.

హైదరాబాదునుండి రాంబాబు అప్పుడప్పుడు ఉత్తరాలు వ్రాస్తూండేవాడు. ఆరునెలల తరవాత రాంబాబునుండి ఆఖరు ఉత్తరం వచ్చింది తనకు, జ్యోతి మొగపిల్లవాణ్ణి కని పురిటిలోనే చనిపోయిందని. తను కోర్టుపనుల ఒత్తిడివల్ల వారం రోజుల తరవాత గాని హైదరాబాదు వెళ్ళలేకపోయాడు. ఇంటికి తాళం వేసి ఉండడంవల్ల బహుశః ఆఫీసుకుగాని వెళ్ళాడేమోనని అతను పని చేస్తున్న కంపెనీకి వెళ్ళాడు. నాలుగు రోజుల కిందటే ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి వెళ్ళాడని చెప్పారు. తిరిగి అతను ఉంటున్న ఇంటికి వెళ్ళిన తనకు, అతను నాలుగు రోజుల కిందటే ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడని, ఎక్కడకు వెళుతున్నది ఎవరికి చెప్పలేదని పక్క ఇంటివాళ్ళు చెప్పారు. నాలుగు రోజులు హైదరాబాదంతా తిరిగాడు తను ఎక్కడైనా కనిపిస్తాడేమోనని. నిరాశే ఎదురైంది. ఇంటికి తిరిగి వచ్చిన తను ఈ మూడేళ్ళు ప్రతి రోజూ అతని దగ్గిరనుండి ఉత్తరం వస్తుండేమోనని ఎదురు చూచాడు. **రెండు రోజుల కిందట టెలిగ్రాము, ఈ రోజు**

నర్తకులు

కత్తిరింపు చిత్రం—కోరా సీతామహాలక్ష్మి (క్రోసూరు)



ఉత్తరం వచ్చాయి.

గత స్మృతుల తోరణం నిలిచిపోగానే వర్తమానం లోకి వచ్చాడు మురళీ కృష్ణ. ఒక్కసారి కళ్ళు తుడుచుకుని టేబిలుమీద ఉన్న ఉత్తరం తీశాడు. నెమ్మదిగా చించి లోపల ఉన్న కాగితాన్ని బయటికితీసి చదవడం మొదలుపెట్టాడు.

"ప్రియమైన మురళీ,

నా జీవితం ఎంత చిత్రమైనదో, నీకు కొంతవరకే తెలుసు. అమ్మ ఎవరో నాన్న ఎవరో తెలీదు నాకు. నాకు అయిదేళ్ళు వచ్చిన దగ్గిరనుండి నా మనస్సు పని చెయ్యడం మొదలుపెట్టింది. 'నాకు కూడ అమ్మ ఉంటే ఎంతబాగుండేది' అనుకుంటూండేవాణ్ణి. రోడ్డు మీద ఏ అమ్మ అయినా తన బిడ్డను ఎత్తుకుని వెళుతూంటే రెప్ప వెయ్యకుండా చూస్తూ నిలబడేవాణ్ణి. 'ఒక్కసారి నన్ను కూడా ఎవరైనాఅలా ఎత్తుకుంటే' అనుకునేవాణ్ణి. ఒకసారి ఎలిమెంటరీ స్కూలుకు వెళుతూంటే ఒకావిడ కొడుకు నెత్తుకుని ఒక చేత్తో అన్నం పళ్ళెం పట్టుకుని చిన్న చిన్న ముద్దలుచేసి తిని పిస్తూంది. నేను చూస్తూ అలాగే నిలబడిపోయాను. 'ఎందుకబ్బాయి అలా చూస్తావు? వెళ్ళు వెళ్ళు' అంది ఆవిడ. తల వంచుకుని స్కూలువేపు నడిచాను.

రాత్రుళ్ళు అందరూ పడుకున్న తరవాత దేవుని పటంముందు నిలబడి 'దేవుడా! ఒక్కసారి మా అమ్మను చూపెట్టవూ! ఒక్కసారి చాలు, ఒక్కసారి మా అమ్మ నన్ను ఎత్తుకుంటే చాలు' అని గంటల తరబడి అడిగేవాణ్ణి. దేవుడు నావేపు నవ్వుతూ చూడ్డంతప్ప ఏమీ అనేవాడు కాదు. పక్కమీదికి వచ్చి మనస్సులోనే ఏడుస్తూ కూర్చుండేవాణ్ణి.

నీతో పరిచయం అయ్యేంతవరకు శరణాలయం, స్కూలుతప్ప ఎవరి ఇంటికి వెళ్ళలేదు. ఇంట్లో లోపల ఎలాగుంటుందో కూడా నాకు తెలీదు. నీవు మీ ఇంటికి రమ్మని పిలిచినప్పుడు వద్దామని మనస్సులో ఉన్నా ఎందుకో భయం వేసేది. అందుకే చాలా కాలంవరకు మీ ఇంటికి రాలేదు. మీ అమ్మగారిని చూచిన మరుక్షణంలోనే ఎందుకో ఆవిడే మా అమ్మ అనిపించింది. దానికి మీ అమ్మగారు చూపిన ఆప్యాయత మరింత బలాన్ని ఇచ్చింది. నీతో ఆడుకుని శరణాలయానికి వెళ్ళాక మీ అమ్మగారి ఒళ్ళో కూర్చుని ఆవిడ నా నోటికి అన్నం ముద్దలు అందిస్తుంటే తింటూన్నట్టు కలలు కనేవాణ్ణి. ఒకవేళ భగవంతుడు నా ప్రార్థన విని ఆమె దగ్గిరికి నన్ను చేర్చాడేమో ననుకునేవాణ్ణి. ఒక్క రోజైనా ఆమెను చూడక పోతే ఉండలేకపోయేవాణ్ణి. బయటికి ఆమెను 'ఏమండీ' అని పిలిచినా మనస్సులో ఎప్పుడూ ఆమెను 'అమ్మా'అనే పిలుచుకుండేవాణ్ణి. ఆవిడ ఆప్యాయతతోను, నీ స్నేహంతోను నా బాధలు మరిచిపోగలిగాను. మనస్సులో ఎప్పుడూ నీవు నా తమ్ముడవని మీ అమ్మా నాన్నగార్లకు నేను పెద్ద కొడుకునని అనుకుంటూండేవాణ్ణి. హైదరాబాదు వెళ్ళిన తరవాత నన్ను మళ్ళా ఒంటరితనం ఆవరించింది. మిమ్మల్ని, ముఖ్యంగా అమ్మను, చూడాలన్న కోరిక అణుచుకోడానికి చాలా బాధపడేవాణ్ణి.

జ్యోతితో పరిచయం అయిన తరవాత మళ్ళా నా మనస్సుకు శాంతి లభించింది. చిన్నతనంనుండి అమ్మే కావాలనుకున్న నా మనస్సు ఆమె దగ్గిరలో అటువంటి ఆనందాన్నే పొందేది. జ్యోతి నిజంగా ఒక దేవత. ఆమె సాన్నిధ్యంలో ప్రపంచాన్నే మరిచిపోయి చిన్న పిల్లవాడుగా అయిపోయేవాణ్ణి. ఇద్దరం చిన్నతనంనుండి ఒకే రకమైన జీవితాన్ని గడపడంవల్ల ఒకళ్ళ నొకళ్ళం పూర్తిగా అర్థం చేసుకున్నాం.

ఆ విధంగా నా జీవితంలో ఒక అద్దాలమేడ కట్టుకున్నాను. కానీ నేను కట్టుకున్న ఆ మేడను చూచి భగవంతుడు నవ్వుకున్నాడు. దిక్కుమాలినవాడికి మేడ ఏమిటని చిలిపితనంగా ఒక రాయి విసిరాడు. అంతే! నా మేడ కూలిపోయింది. దేవతల్లాంటి అమ్మను, నాన్నను, జ్యోతిని తన దగ్గిరికి తీసుకుని నన్ను దూరంగా విసిరేశాడు. తోడులేక ఏడుస్తానేమోనని నాకు తోడుగా నాలాంటి నిర్భాగ్యుడే అయిన నా బాబుని నాకిచ్చాడు. నా బాబుకూడా మళ్ళా అలాగే అమ్మ లేనివాడయ్యాడు. నేను ఎటువంటి జీవితం గడిపి 'అటువంటి జీవితం పగవాడికి కూడా వద్దు భగవంతుడా' అనుకున్నానో అటువంటి జీవితమే నా బాబు కూడా గడపవలసి వస్తుందని కలలో కూడా అనుకోలేదు. జ్యోతి పోయినతరవాత నా బాబుని ఎలా పెంచాలో నాకు తెలియలేదు. జ్యోతి పెరిగిన అనాథ శరణాలయంలోనే నా బాబుని అప్పజెప్పి ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి ఒక సంవత్సరం దేశమంతా తిరిగాను. ఇంతలో చైనా యుద్ధం వచ్చింది. ఎవ్వరికీ ఉపయోగపడని నా శరీరాన్ని కనీసం అందరికీ మాతృదేవత అయిన దేశానికైనా అర్పిద్దామని సైన్యంలో చేరాను. రెండు సంవత్సరాల్లోనే కాప్టెను అయాను.

మురళీ! నాది ఒక్కటే కోరిక. నా బాబు నాలాగా అమ్మ కావాలని ఏడవ కూడదు. వాడికి అమ్మ కావాలి. వాడిని ఎత్తుకుని హృదయానికి హత్తుకునే మాతృమూర్తి కావాలి. వాడు నాలాగా పదిమందిలో ఉంటూ కూడా ఒంటరి జీవితం గడపడానికి వీల్లేదు. నేను ఎటువంటి బాధలు పడింది నాకు తెలుసు. నా రక్తంలో రక్తమైన నా బాబు, నా జ్యోతి నాకు ప్రసాదించిన నాబాబు కూడా అటువంటి బాధలే పడడానికి సిద్ధంగా ఉన్నాడంటే నేను భరించలేను. అంతకంటే ఘోరమైన శిక్ష ఈ ప్రపంచంలో ఇంకొకటి ఉండదు.

నువ్వూ, శారదా కలిసి వాణ్ణి పెంచండి. మీ రిద్దరూ వాడికి అమ్మా నాన్నా అవండి. ఎప్పటికీ కూడా మా విషయం వాడికి తెలియనివ్వకండి. నా జీవితంలో నాకు మిగిలిన కోరికల్లా ఇదొక్కటే. నా కోరిక తీరుస్తావు కదూ?

నా శరీరాన్ని ఏ క్షణంలో మాతృదేశ రక్షణకు బలి ఇవ్వాలో తెలీదు. నన్ను ఇంక మరిచిపొండి. సెలవు.

రాంబాబు."

ఉత్తరం చదవడం పూర్తిచేసిన మురళీకృష్ణ అలాగే కుర్చీకి అతుక్కుపోయాడు. అతని కళ్ళ వెంబడి ధారాపాతంగా నీళ్ళు కారుతున్నాయి. "రాంబాబు,రాంబాబు" అంటూ గొణుక్కుంటున్నాడు.

"ఏమండీ! మళ్ళా ఏమైందండీ! ఎక్కడనుండి ఆ ఉత్తరం?" అంటూ కంగారుగా భర్త భుజం పట్టుకుని కుదిపింది అక్కడకు వచ్చిన శారద.

నిశ్శబ్దంగా ఉత్తరం అందించాడు.ఉత్తరం పూర్తిగా చదివి "ఏమండీ, రేపే హైదరాబాదు వెళ్ళి మన బాబుని తెచ్చుకుందామండీ" అంది కళ్ళు తుడుచుకుంటూ శారద. ★


ఉచితము! ఉచితము!!

తెల్ల మచ్చలు

మా ప్రఖ్యాతి వహించిన 'డాగ్‌సాఫా' ప్రత్యేక ఔషధము తెల్ల మచ్చలను సులభముగా పోగొట్టుటలో 1925 సం॥ నుండి ప్రఖ్యాతి వహించియున్నది. మూడులోపలు వాడినంతనే మచ్చలు తెలుపుదనం ఆపైన కొన్నిరోజులలోనే పూర్తిగా బాగుచేయు శక్తికలదు. ఉచితంగా ఒక పాకెట్ మందు ఇవ్వబడును. నకలును చూచి మోసపోకండి.

BENGAL AYURVED BHAWAN
P.O. Katri Sarai (Gaya)

ఉచిత బహుమతి: 3 నెలలు మాత్రమే



స్త్రీలకు సొగసు నిచ్చు కూర్చు కాశ్మీర్ ఆర్టు చీరెలు, నూతనమైన ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లు, రంగులలో ఇప్పుడే వచ్చిఉన్నవి. పెద్ద సైజు. మావద్ద మాత్రమే దొరకును. డీలక్స్ చీరె ఒకటి రు. 11/-లు, 2 రు. 20/-లు, 3 రు. 28/-లు, 4 రు. 36/-లు. రెండుగాని అంతకు మించిగాని చీరెలకు ఆర్డరు పంపువారికి బ్లౌజు ముక్క ఉచితం.ఆర్డర్లు పోస్టు పార్సెల్ ద్వారా పంపబడును.

ARVIND AGENCIES (WAV-22)
P.O. Box 1408, Delhi-6.

